యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- తీరగ్రామాల ప్రజలు గగ్గోలు
- నాగాయలంక మండలంలో మట్టి వ్యాపారుల స్వైరవిహారం

నాగాయలంక: మండల వ్యాప్తంగా పలు తీర గ్రామ ప్రాంతాల్లో మట్టి, బుసక అక్రమ తవ్వకాలు, రవాణ యథేచ్ఛగా సాగుతోంది. మట్టి తవ్వకాల దందాను నిలువరించే పరిస్థితులు కనబడటం లేదంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో విచ్చలవిడిగా భారీ వాహనాలతో దిగువన తీర ప్రాంత గరువు భూముల్లోని బుసక, పొలాల నుంచి మట్టి అక్రమంగా తరలిపోతోంది. పూర్వ ప్రభుత్వ దిబ్బ భూములను అక్రమ మట్టి రవాణాకు ఎంచుకోవడం, గ్రామ స్థాయి నుంచి రెవిన్యూ అధికార యంత్రాంగం చోద్యం చూడటంతో గందరగోళంగా మారింది. తీరగ్రామాల మట్టి దిబ్బలను కొల్లగొట్టి ఎగువన నాగాయలంక, అవనిగడ్డ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.


మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న దృశ్యం

ఆగని మట్టి తవ్వకాల దందా

మండలంలోని ఆయా గ్రామాల్లో పదుల సంఖ్యలో మట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల రణగొణ ధ్వనులతో రాత్రి వేళల్లో నిద్ర పట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డుకోవాలని చూస్తే మట్టి అక్రమ రవాణాదారులు ఏ మాత్రం ఖాతరు చేయడంలేదని మండిపడుతున్నారు. అదేమంటే పాలక పక్షాల నేతల అండతో మాకు మైనింగ్ అనుమతులు ఉన్నాయని బుకాయిస్తున్నారని దీంతో చేష్టలుడిగి చూడటం మినహా ఏమీ చేయలేక పోతున్నామని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామకమిటీ పెద్దలు

అధికారులు చర్యలు తీసుకోవాలి

పర్యవసానంగా మండలంలోని గణపేశ్వరం - బిల్లీగ్రాహం నగర్ గ్రామ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులు ఆయా గ్రామాల చుట్టు పక్కన మట్టి తవ్వకాలు, వాహనాలతో ధ్వని కాలుష్యం భరించలేకపోతున్నామంటూ తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీకి వినతిపత్రం అందజేశారు. మట్టి అక్రమ రవాణా, తవ్వకాలు అడ్డుకోవాలని లేదంటే ఆందోళన చేపడతామని కమిటీ పెద్దలు తెలిపారు.

క్లుప్తంగా

పెదన మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



పెదన: పెదన మున్సిపల్ కమిషనర్‌గా ఎల్. చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.గోపాలరావును మచిలీపట్నం కార్పొరేషన్‌కు అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ(మున్సిపాలిటీ) కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఈయన మరో నాలుగు నెలల్లో రిటైర్డ్ కానున్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

పెదన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సోమవారం డీఎస్సీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ రాజారమేష్, అడ్మిన్ పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 180 మందికి గాను 137 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 167 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఘనంగా ఉప్పాల పుట్టిన రోజు వేడుకలు



పెదన: వైఎస్సార్ సీపీ పెదన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రమేష్(రాము) పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో పెదన నియోజకవర్గంలోని పెదన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన పలువురు నాయకులు, సర్పంచులు రాముతో కలిసి కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఘంటసాల: మండల పరిధిలో విద్యార్థులు, ప్రజల అవసరాల కోసం మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వేములపల్లి, చిట్టూర్పు గ్రామాల్లో మంగళవారం, 11వ తేదీన తెలుగురావుపాలెం, దేవరకోట, 12న శ్రీకాకుళం, ఘంటసాల, 13న పాపవినాశనం, ఘంటసాల గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా క్యాంపుల్లో ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయడం, మార్పులు - చేర్పులు, కొత్త ఆధార్ కార్డులు వంటి సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రహదారి మరమ్మతులు



ఘంటసాల: ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు ఎట్టకేలకు అధికారులు చెక్ పెట్టారు. ఘంటసాల - అంబేడ్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వర్షాలకు నీరు నిలవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై సాక్షి పత్రికలో గత నెల 27న అధ్వాన రహదారితో అవస్థలు అనే కథనం ప్రచురించారు. అలాగే ఇటీవల ఈ రోడ్డులో ప్రయాణించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రోడ్డు దుస్థితిని గుర్తించి మండల పరిషత్ నిధులు రూ.1 లక్ష, పంచాయతీ నిధులు రూ.1 లక్షతో సోమవారం రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. ఘంటసాల సెంటర్ నుంచి అంబేడ్కర్ నగర్ రోడ్డులోని పురుషోత్తం మిల్లు వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

మందులను మార్చి వినియోగించాలి



కోసూరు(మొవ్వ): పంటలకు వాడే రసాయన మందుల రకాలను మార్చి పిచికారీ చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి సూచించారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని కోసూరు సచివాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. మొవ్వ ఏఓ శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవతి డ్రోన్‌ల ఆవశ్యకతను తెలియజేశారు. డ్రోన్ పిచికారీతో కలిగే లాభాలను వివరించారు. మొవ్వ సబ్ డివిజన్ సహా వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎస్ శ్యామల ,డాక్టర్ అనిత, ఉద్యాన అధికారి కీర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం

బంటుమిల్లి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బంటుమిల్లి మండల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండల ఉపాధ్యక్షులుగా కాగిత రాఘవులు, పల్లికొండ శివ, ప్రధాన కార్యదర్శులుగా కాగిత శివాజీగణేష్, యలవర్తి మోహన్‌రావు, యెరుబండి దుర్గాప్రసాదు, బొమ్మిడి నాగార్జునలను నియమించారు. అలాగే కార్యదర్శులుగా కాగిత శ్రీనివాసరావు, మాదాసు నాగేశ్వరరావు, చదలవాడ కుమారస్వామి, వల్లభ నరసింహారావు, పాము పుష్పలను నియమించారు. సభ్యులుగా కొప్పిలేటి శ్రీనివాసరావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు, జల్లా వెంకట నాగమల్లేశ్వరరావు, సోగాని లక్ష్మణరావు, దాసరి కోటితిరుపతిరావు, సంగిశెట్టి దుర్గారావు, బోయిన రాధాకృష్ణ, మీగడ సత్యన్నారాయణ, పాపాని భగవాన్, యలవర్తి గోపాలకృష్ణ, మెట్ల వేణుగోపాలకృష్ణుడు, కాట్రగడ్డ రారాజు, గొల్ల ప్రవీణ్, అప్పికట్ల శేఖర్, వేముల లలిత, గురజ రాజ్యలక్ష్మి, పుప్పాల నాగలక్ష్మి, ఎద్దు రాజమణిలను నియమించారు.

జర్నలిజానికి సంకెళ్లు రాజ్యాంగ అపహాస్యమే

ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి



మచిలీపట్నంటౌన్: జర్నలిజానికి సంకెళ్లు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాలనలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని, ప్రజలకీ ప్రభుత్వానికి వారధిగా వారు ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై అక్రమ కేసులు పెట్టి పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. ముమ్మాటికీ ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని అభివర్ణించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, పత్రికలపై దాడి ఓ రకంగా ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ఘంటసాల: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని విద్యుత్తు శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు, విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీ కృష్ణానాయక్ హెచ్చరించారు. ఘంటసాల మండలంలోని వ్యాపార, గృహ సముదాయాల విద్యుత్ వినియోగదారుల సర్వీసులను ఆ శాఖ అధికారులు 50 మంది 32 బృందాలుగా ఏర్పడి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు వాసు, కృష్ణానాయక్‌లు మాట్లాడుతూ ఘంటసాల మండలంలో ఆరుగురు విద్యుత్ వినియోగదారులు కేటగిరి-1 పేరుతో కనెక్షన్ తీసుకుని ఇతర కేటగిరీలకు వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ.9,400లు జరిమాన విధించారు. అలాగే 229 మంది విద్యుత్తు వినియోగదారులు అనుమతించిన లోడు కంటే 309 కిలోవాట్స్ అదనంగా విద్యుత్తు వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ.6.18 లక్షలు చొప్పున మొత్తం 235 మందికి రూ.6,27,400ల జరిమాన విధించినట్లు వివరించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. విద్యుత్ చౌర్యం చేస్తే పూర్తి వివరాలతో 94408 12091, 94408 12363లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. అలాగే పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్ అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో చల్లపల్లి, అవనిగడ్డ డీఈఈలు పులి శివనాగేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఘంటసాల ఏఈఈ పి.రవికుమార్, డివిజన్, ఇతర సెక్షన్లలోని ఏఈఈలు, జేఈఈలు, ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్తు విజిలెన్స్, ఆపరేషన్ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు వాసు, కృష్ణానాయక్

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు, పండితులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- పుష్పపరిమళాలతో శోభిల్లిన వెంకన్న కోవెల
- కల్యాణాన్ని తిలకించేందుకు పోటెత్తిన భక్తజనం

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ఆలయం ముందు భాగంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామివారిని రాజసింహాసనంపై, అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఊరేగించుకుంటూ తీసుకువచ్చారు. టీటీడీకి చెందిన వేదపండితుల మంత్రోచ్ఛరణలు నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఉపన్యాసవాచస్పతి మొవ్వ వృషాద్రిపతి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పండితులు స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రత్యేక పాటను ఆలపించారు. స్వామివార్ల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.


ప్రత్యేక అలంకారంలో స్వామివార్ల మూలమూర్తులు

గరుడవాహనంపై ఊరేగింపు

సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై కల్యాణమూర్తులకు తిరువీధి ఉత్సవం జరిపారు. కోడూరు, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగింపునకు భక్తులు ఘనస్వాగతం పలికారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

బంటుమిల్లి: మూడేళ్లు నిండిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎం. సముద్రవేణి పేర్కొన్నారు. త్వరలో వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని స్థానిక కోర్టు ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాలు ఈనెల తొమ్మిది నుంచి 17 వరకు గ్రామగ్రామాన నిర్వహించాల్సి ఉందని చెప్పారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఈనెల 12వ తేదీన మెగా అక్షరాభ్యాసం, అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారుల వయస్సును బట్టి పీపీ -1, పీపీ - 2లుగా నమోదు చేసుకోవాలని సీడీపీఓ సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు నాగలక్ష్మి, కార్యకర్తలు రాజమ్మ, సుజాత, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కనుమూరు(పామర్రు): మండలంలోని కనుమూరులో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ వీ భానుశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులకు ఆసక్తికరంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహారాలను తీసుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని కొబ్బరితోటలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీడీపీఓ భానుశ్రీ, పెదమద్దాలి, పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్లు విజయకుమారి, నూతక్కి సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చి వారి బంగారు భవితకు బాటలు వేసిన సహాయ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పెడన బైపాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం వేసవి సెలవుల్లో పలు కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు అతిథులు మాట్లాడుతూ సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు మచిలీపట్నంలో కరాటే, డాన్స్, పెడనలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం ఆదర్శనీయమని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషాను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డాన్స్‌లు, కూచిపూడి నృత్యాలు, కరాటే ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి.


కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం


షైనింగ్ అవార్డులను అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రూతమ్మ తదితరులు


కలెక్టరు నుంచి అవార్డు అందుకుంటున్న సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్

పెడన: మండలంలోని బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు షైనింగ్ స్టార్ అవార్డులను అందుకున్నారని ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్ హాలులో సోమవారం ఇంటర్ విద్యార్థిని తాణంకి మైథిలి(944), పదో తరగతి విద్యార్థిని జుజ్జువరపు అఖిల(571) జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మల చేతులు మీదుగా అవార్డులను అందుకున్నారని పేర్కొన్నారు. రూ.20వేలు నగదు, ప్రశంసా పత్రం, మెమెంటోలను అందజేశారని చెప్పారు. విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను అభినందించారని తెలిపారు.

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు డాగూరి రామ్‌చరణ్, భీమనాతి శ్రీవల్లి, బుద్దన వెంకటలక్ష్మీ తేజస్విని, షేక్ సఫీయా రోషన్, బందెల తానియాసిప్రా ఆనంద్, నుగలాపు కల్యాణి, అజ్మీ రాహనీశ్రీ షైనింగ్ అవార్డులు అందుకున్నారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ డీకే బాలాజీ, డీఈఓ రామారావు, ఎస్పీ గంగాధర్ అభినందించారు.

కొల్లూరికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి నివాళి

చల్లపల్లి: అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొల్లూరి నాగేశ్వరరావు(80)కు ఆ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం నివాళులర్పించారు. లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలోని ఆయన స్వగ్రామానికి వెళ్లి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తంచేశారు. కాగా నాగేశ్వరరావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, మత్తి రాంబాబు, అవనిగడ్డ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అర్షద్, వక్కలగడ్డ గ్రామ సర్పంచ్ వల్లూరి ఉమ, చల్లపల్లి మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, నాయకులు జుజ్జువరపు భాగ్యారావు, వెనిగళ్ల తారకజగదీష్, యడ్ల జగదీష్, మోదుమూడి కుటుంబరావు, మోదుమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అవనిగడ్డ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాదు కూడా కొల్లూరి నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు.


కొల్లూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: యోగాతో మన ఆరోగ్యం కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ టాకీస్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి అందరితో యోగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని ప్రతిరోజూ అరగంటసేపు యోగా చేయడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు లభిస్తాన్నాయన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐఓ సాల్మన్ రాజు, యోగా గురువు ఎం. శాస్త్రి, నగరపాలక సంస్థ, ఆయుష్ శాఖ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మచిలీపట్నంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు


చల్లపల్లిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు


పెడనలో మాట్లాడుతున్న కమిషనర్ గోపాలరావు, మేనేజర్ రాజా తదితరులు


మోపిదేవిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

చల్లపల్లిలో ర్యాలీ

చల్లపల్లి: యోగా ప్రతి ఒక్కరికీ ఒక నిత్యకృత్యం కావాలని వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీవో ఏపీ రమణ, ఎంపీటీసీ సభ్యురాలు పీ స్వప్న, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

మోపిదేవి: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండల, పంచాయతీల స్థాయిలో సోమవారం ర్యాలీ నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన గుడి సెంటర్ వరకు యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా షెడ్యూల్స్ ప్రకారం అవగాహన ర్యాలీ చేపట్టినట్లు ఈవోపీఆర్డీ వివరించారు. మండల పశువైద్యశాఖ, రెవిన్యూ, వెలుగు, ఎస్ఆర్ఈజీఎస్, ఎంపీపీ రావి దుర్గావాణి, ఏఓ పాండురంగారావు, వెటర్నరీ డాక్టర్ నందకిషోర్, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యాన మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు సోమవారం యోగాంధ్రపై ర్యాలీ నిర్వహించారు. పెడన మార్కెట్ యార్డు నుంచి ప్రధాన రహదారి వెంబడి బంటుమిల్లి రోడ్డు సెంటరు వరకు ర్యాలీ సాగింది. తొలుత యార్డు వద్ద కమిషనర్, మేనేజర్ మాట్లాడుతూ యోగాసనాలు మానసిక ఒత్తిడిని జయించడానికి, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు నేర్చుకుని వాటిని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా, వివిధ విభాగాల అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



గుడ్లవల్లేరు: విద్యా హక్కు చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) జిల్లా కమిటీ సభ్యులు పి.సురేష్, కె.అలెగ్జాండర్, సాయిరామ్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వోకు వినతి పత్రం అందించామని తెలిపారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లతో పేదలకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.

సమావేశాలకు హాజరుకాని వారిపై ఫిర్యాదు

పమిడిముక్కల: మండల పరిషత్ సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు తెలిపారు. మొత్తం 25 శాఖల అధకారులు సమావేశానికి రావాల్సి ఉండగా, కేవలం 10 శాఖల వారే హాజరయ్యారని పేర్కొన్నారు. గత మూడు సమావేశాలుగా గైర్హాజరువుతున్న అధికారుల జాబితా తయారు చేస్తామన్నారు. వీరికి నోటీస్ పంపి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ వేల్పూరులో అనుమతులు లేకుండా పంచాయితీ చెరువు తవ్వుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, పనులు నిలుపుదల చేయించానని తెలిపారు. ప్రజాప్రతినిధుల కోరిక మేరకు అన్ని శాఖల అధికారులతో మరో నెల రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు మాత్రమే అన్నదాత - సుఖీభవ వస్తుందని, కౌలుదారులకు ప్రస్తుతం వచ్చే అవకాశం లేదని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. ధాన్యం రవాణా చార్జీలు ఇంకా రాలేదని, ఎప్పుడిస్తారని ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు ప్రశ్నించారు. తహసీల్దార్ సమావేశానికి రాకపోతే సమస్యలెలా పరిష్కారమవుతాయని నిలదీశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.